నీటిసంఘం ఎన్నికలు నిర్వహించేనా?

- ఆ దిశగా చర్యలు తీసుకోని ప్రభుత్వం
- చివరిసారిగా 2006లో నిర్వహణ
- అధ్వానంగా చెరువులు, కుంటలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



ఐనాపూర్ పెద్ద చెరువు

దోమ: చెరువులు, కుంటలకు సంబంధించిన నీటి సంఘం ఎన్నికలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చెరువుల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ కాకతీయ పథకాన్ని తీసుకొచ్చింది. ఒకప్పుడు చెరువులు, ఆయకట్టుకు సంబంధించి నీటి సరఫరా, పర్యవేక్షణ వంటివి నీటి సంఘాలు, పాలకవర్గాలు నిర్వహణ బాధ్యతను చూసుకునే వారు. దీంతో 18 ఏళ్లుగా ప్రభుత్వాలు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ కరువై అవి అధ్వానంగా తయారయ్యాయి. మరో వైపు ఈ సంఘాలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

గతంలో ఇలా..

గతంలో సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే వందల ఎకరాల్లో ఆయకట్టు, ప్రధాన చెరువులకు చైర్మన్‌తో పాటు డైరెక్టర్లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు వాటి నిర్వహణ బాధ్యతతో పాటు నీటిని పంట పొలాలకు విడుదల చేసేవారు. నీటిని పొదుపుగా వాడుకునేలా రైతులకు అవగాహన కల్పించేవారు. ఇలా రైతులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. ఏళ్లుగా నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది.

2008 నుంచి నిలిపివేత..

దోమ మండల వ్యాప్తంగా మొత్తం 36 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ వాటి పరిధిలో 144 చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 7,593ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. 2006 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వందల ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారు. వాటి పదవికాలం 2008తో ముగిసింది. ఈ క్రమంలో అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించిన దాఖలాలు లేవు.

చెరువులు పాడవుతున్నాయి



అధికారుల పర్యవేక్షణలోపంతో చెరువులు, కుంటలు పాడవుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటల తూములు లీకేజీలకు గురవుతున్నాయి. కొందరు పలు చోట్ల కబ్జాలకు పాల్పడిన సందర్భాలూ ఉన్నాయి. వాటిని అధికారులు కనీస మరమ్మతులు చేయించకపోవడంతో నీరు వృథాగా పోతుంది. ఎన్నికలు నిర్వహిస్తే వాటి పర్యవేక్షణ చైర్మన్లు, డైరెక్టర్లకు ఉంటుంది.

– ఆర్. నర్సింహారెడ్డి, రైతు, బొంపల్లి

ప్రభుత్వం దృష్టి సారించాలి



నీటి సంఘాలను ఎన్నుకుంటే చెరువులు, కుంటల అభివృద్ధికి నీటి సంఘాల నాయకులకు వాటిపై బాధ్యత పెరుగుతుంది. నీటిని పొదుపుగా వాడుకోవడానికి తగిన అవగాహన కార్యక్రమాలు చేపడుతారు. గత ప్రభుత్వం మిషన్‌కాకతీయ పథకంతో చెరువులను అభివృద్ధి చేసింది. ఈ ప్రభుత్వం నీటి సంఘాలపై దృష్టి సారించి చెరువులు, కుంటలను పరిరక్షించాలి.

– ఎం. వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నేత

ఎలాంటి ఆదేశాలు లేవు



నీటి సంఘాల ఎన్నికలపై తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తే చెరువులు, కుంటలు అభివృద్ధి చెందడంతో పాటు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ విషయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఆదేశాలు వస్తే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం.

– సిద్దార్థ్, ఇరిగేషన్ ఏఈ, దోమ

క్లుప్తంగా

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలే

కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్



పౌరహక్కులపై వివరిస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ గఫార్

బంట్వారం: సమాజంలో పౌరుల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కొట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం కోట్‌పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ చట్టంపై అవగాహన ఉండాలన్నారు. కులం, మతం, వివక్ష, అంటరానితనం వంటి వాటిపై అవగాహన కల్పించారు. స్వేచ్ఛా, సమానత్వం, జీవించేహక్కుపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ భాగ్యలక్ష్మి, ట్రైనీ ఎస్‌ఐలు వేణు, తిరుమలేశ్ యాదవ్, మర్పల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జన గణనతోనే సామాజిక న్యాయం

బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిగి: కులాధారిత జన గణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్‌కు బీఎంపీ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సగభాగంగా ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు 52శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఎన్నికలను ఈవీంల ద్వారా నిర్వహించి పీపుల్స్ రిప్రెజెంటేటీవ్ యాక్ట్ 1951కి వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోవీంద్‌నాయక్, బాబ్య, సూర్యనాయక్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సత్తా చాటిన నృత్య విద్యార్థులు



నగదు, బహుమతి అందుకుంటున్న అకాడమీ నిర్వాహకురాలు

అనంతగిరి: ముద్దాయిపేటలో జగన్మాత రేణుక ఎల్లమ్మ జాతర ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వికారాబాద్ పట్టణానికి చెందిన సరస్వతి నృత్య అకాడమీకి చెందిన చిన్నారులు నిర్వహించిన ప్రదర్శనలో సత్త చాటారు. అనంతరం మొదటి బహుమతి రూ.10వేలు, షీల్డ్ అందుకున్నారు. శాంక్, సాక్షి, అక్షిత, హిమసంజన, తులసి, మహస్విత, అవినాష్, నిరిక్షిత స్వేత, దీక్షితాశ్రీ , శివకేశవ్, శ్రీ రాఘ, మాయ, నయనిశ వర్ణిక, అవంతిక, సాన్వి, అన్విత, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ వినోద్‌కుమార్ నృత్య అకాడమీ గురువు సరస్వతిరాజ్, చిన్నారులకు బహుమతి ప్రదానం చేసిన అనంతరం వారిని అభినందించారు.

హోంగార్డుకు అభినందన



హోంగార్డు కృష్ణను సన్మానిస్తున్న ఎస్పీ

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో హోంగార్డు కృష్ణ సోమవారం చాకచక్యంగా వ్యవహరించి ఓ మొబైల్ దొంగను పట్టుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆయన్ను శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తుక్కుగూడ: వార్డు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కౌన్సిలర్ వై.శివకుమార్ అన్నారు. మంగళవారం పుర పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్డులో ఇప్పటివరకు కోట్ల నిధులతో పలు రకాల అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు.

సర్వేనమోదును పకడ్బందీగా నిర్వహించాలి



కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



దోమ: శివారెడ్డిపల్లిలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు



తాండూరు రూరల్: ఎల్మకన్నెలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదును పకడ్బందీగా నిర్వహించాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించిన అనంతరం ఫొటోలను యాప్‌లో ఎంట్రీ చేయాలన్నారు. అనంతరం అల్లాపూర్, బొయకోటలు, రాంరెడ్డిపల్లి పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను సమర్థవంతంగా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. శివారెడ్డిపల్లి, బాస్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తుందని, పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను పారదర్శకంగా చేపడుతున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శులు రవి, సాహేరబేగం, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ విశ్వప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాండూరు మండలంలో 33 గ్రామాలు, 8 అనుబంధ గ్రామాల్లో కలిపి ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,210 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఇళ్లకు సంబంధించి సర్వే చేసి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 10వేల దరఖాస్తులు అప్‌లోడ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నాడు ఆదరణ.. నేడు కనుమరుగు!

కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలు ఎక్కడ చూసినా ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకునేందుకు చిన్నా, పెద్దా, ముఖ్యంగా విద్యార్థులు గ్రీటింగ్ కార్డుల కోసం వెతికి మరీ కొనుకునే వాళ్లు. ఒక్కో షాపుకెళ్లి మరి తమకు నచ్చిన సినిమా ఆర్టిస్టులు, హీరో, హిరోయిన్లు, మంచి సినరీస్ వంటివాటిని తీసుకునేవారు. అది గతం.. ఇప్పుడు గ్రీటింగ్ కార్డుల ఊసేలేదు. వాటిని మరిచి పోవడం బాధాకరం. నేడు కొత్తదనంవైపు పరుగులు తీస్తున్నారు.

- కొత్త సంవత్సరం వచ్చిందంటే గ్రీటింగ్ కార్డుల సందడి
- వాటి ఊసెత్తని యువత
- ప్రస్తుతం వాట్సాప్, ఈ మెయిల్, ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో చిట్‌చాట్



గ్రీటింగ్ కార్డులు

దుద్యాల్: కొత్త సంవత్సరం వచ్చిందంటే చాలు స్నేహితులకు, బంధువులకు, శుభాకాంక్షలు చెప్పుకోవడం పరిపాటి. పండగలకు, ప్రత్యేక రోజులు, వివాహ వార్షికోత్సవాలకు, ఇలా ప్రత్యేక సందర్భాల్లో పలకరింపులు సహజంగా మారింది. ఇలాంటి అభి రుచులను గతంలో గ్రీటింగ్ కార్డుల ద్వారా తెలుపుకునేవారు. ఒకరినొకరు కలుసుకుని లేదా నేరుగా నచ్చినవ్యక్తుల ఇంటికెళ్లి మరీ గ్రీటింగ్ కార్డును కవరులో పెట్టి చేతికందించి శుభాకాంక్షలు తెలిపేవారు. ముఖ్యంగా విద్యార్థులతో పాటు ప్రేమికులు గ్రీటింగ్ కార్డులకు అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. నేడు అవీ పూర్తిగా కనుమరుగయ్యాయి. ఇప్పుడు వాటి గురించి కొందరు గతాన్ని గుర్తుచేసుకొని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సమాజం అభిరుచి మారింది. ఇంటర్‌నెట్ పరుగులు పెట్టడంతో సోషల్ మీడియాలో యువత మునిగితేలుతుంది. సందర్భం ఏదైనా శుభాకాంక్షలు తెలుపుకోవడానికి వాట్సప్, ఇ మెయిల్, ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి వాటి హవా కొనసాగుతుందని చెప్పొచ్చు.

ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సీఐ, ఎంఈఓ

కొత్తూరు: జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకునే చిన్నారులు తరచూ అనారోగ్యాల బారిన పడేందుకు అవకాశాలు ఉన్నాయని సీఐ నర్సింహారావు అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఆర్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆయన ఎంఈఓ అంగూర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఇందులో భాగంగా వారు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తయారు చేసిన వంటకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో పోషకాహారాలపై అవగాహన పెరుగుతుందని, వారు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కరెస్పాండెంట్ వీరమోని దేవేందర్‌ముదిరాజ్, ఏహెచ్‌ఎం భవాని పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్: జాతీయ ఆహార భద్రత మిషన్ పథకం కింద జాతీయ విత్తన కార్పొరేషన్ ద్వారా అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏఓ నిషాంత్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. యాసంగి సీజన్ కోసం ప్రభుత్వం జాతీయ విత్తన కార్పొరేషన్ ద్వారా డెమో కోసం సబ్సిడీ కింద పూలే సుచిత్ర రకం తెల్లజొన్నలను అందిస్తుందన్నారు. ఒక బ్యాగులో నాలుగు కిలోల తెల్లజొన్న విత్తనాలు ఉంటాయని, ఒక రైతుకు వంద కిలోల జొన్న విత్తనాలను ఇస్తామన్నారు. ఒక బ్యాగు 260 రూపాయలు ఉండగా, ప్రభుత్వం సబ్సిడీ కింద 140 రూపాయలకే రైతులకు అందజేస్తుందన్నారు. సాధారణ విత్తనాల కింద 21 క్వింటాళ్ల జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తెల్లజొన్న విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకార బ్యాంకు సేవలను వినియోగించుకోండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా సహకార బ్యాంకు లిమిటెడ్ పరిధిలోని షాద్‌నగర్ సహకార బ్యాంకు రూ.100కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సహకార బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సహకార బ్యాంక్‌లు డిపాజిట్లను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్‌లో బ్యాంకు అభివృద్ధికి సహకారాలు అందిస్తామన్నారు. సహకార బ్యాంకులు అందించే రుణాలను ప్రజలు క్రమం తప్పకుండా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, సహకార బ్యాంకు డైరెక్టర్లు బక్కన్నయాదవ్, మంజులరెడ్డి, జగదీశ్వర్, అశోక్, దామోదర్‌రెడ్డి, బ్యాంకు నోడల్ ఆఫీసర్ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చేవెళ్ల: ఓంశాంతి ద్వారా ప్రజలకు దైవచింతన, ధ్యానంపై అవగాహన కల్పించే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ కృష్ణయ్య ఆధ్వ ర్యంలో చేవెళ్ల ఓంశాంతి వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, ఓంశాంతి సభ్యు లు పాండు, బాల్‌రెడ్డి, శశికళ తదితరులు ఉన్నారు.

జీవిత బీమాతో కుటుంబానికి ధీమా

ప్రతి వ్యక్తికి జీవిత బీమా ఉంటే ఆ కుటుంబానికి ధీమా అందిస్తోందని ఎల్‌ఐసీ ఏజెంట్ నాగుల శంకర్ గురుప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం చేవెళ్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్రెస్‌క్లబ్ సభ్యులు గోపాల్, రాజేశ్, మధు, రాకేశ్, రాజశేఖర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, రమేశ్, సలీం, యాదయ్య, రమేశ్, సత్యం, నరేందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామస్వామి, బీజేపీ మండల కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనార్ధన్, మాజీ డైరెక్టర్ యాదగిరి, నాయకులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తుక్కుగూడ: తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై అయ్యప్ప భక్తుల ముసుగులో కొందరు భౌతికంగా దాడిచేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌లు అన్నారు. మంగళవారం హెచ్‌ఎంను ఇరువురు నాయకులు వేరువేరుగా పరామర్శించి మాట్లాడారు. అయ్యప్ప మాలధరించిన విద్యార్థిని హెచ్‌ఎం చేయి తగిలిందని తెలిపారు. దీంతో హెచ్‌ఎం కావాలనే విద్యార్థిని కాలుతో తన్నాడనే ఆరోపిస్తూ దాడికి పాలుపడటం అన్యాయమన్నారు. దళితుల ఉద్యోగులపై దాడులు చేస్తే సహించమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సామేల్, జగన్, సత్తయ్య, నర్సింహ, దాసు, సరోజ పాల్గొన్నారు.

వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పూర్తి వివరాలను ఆధార్‌కార్డు అనుసంధానం చేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎస్‌టీఆర్ విద్యాసంస్థల్లోని సమావేశ మందిరంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థుల పూర్తి సమాచారం కోసం ఆన్‌లైన్ అప్‌లోడ్ నిర్వహిస్తుందని సూచించారు. అందులో భాగంగా అపార్ పేరుతో సంపూర్ణ బయోడేటా కోసం ఆధార్ అనుసంధానం బట్టి ఆధార్‌లో ఎలాంటి పేర్లు ఉన్నాయో వాటినే సంక్షిప్తంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తప్పులు లేకుండా సక్రమంగా ఆన్‌లైన్ డేటాను పూర్తిచేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఏదైనా సమస్యలు తలెత్తితే మండల విద్యా కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మల్లయ్య, లక్ష్మారెడ్డి, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ చంద్రశేఖర్ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఎంఈఓ చొరవతో తెరుచుకున్న కార్యాలయం

తాండూరు రూరల్: తాండూరు మండల పరిషత్ కార్యాలయంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎంఈఓ చొరవతో మంగళవారం తెరుచుకుంది. ఎమ్మార్సీ కార్యాలయంలో పని చేస్తున్న సీఆర్‌పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు సమ్మెలో కొనసాగుతున్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు 31న విధుల్లో చేరతారని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రకటించినప్పటికీ వారు విధులో చేరలేదు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మంగళవారం ఎంఈఓ వెంకటయ్య తన పాఠశాలలో పని చేస్తున్న అటెండర్ మహేష్‌ను తీసుకొచ్చి కార్యాలయాన్ని తెరిపించి శుభ్రం చేయించారు. ఇప్పటికే సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించి మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు సుమారు రూ.20 లక్షల వరకు చెల్లించామని ఆయన తెలిపారు. కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్న నర్సింహా రెడ్డి, యాదయ్యగౌడ్ టీచర్లను ఎమ్మార్సీ కార్యాలయంలో పిలిపించుకొని బియ్యం ఇండెంట్, డీఈఓ కార్యాలయం నుంచి వచ్చే మెయిల్స్, రాగిజావ పంపిణీ వంటి పనులను ఎంఈఓ చేయిస్తున్నారు.